



బహిరంగ సభ ర్యాలీ సందర్భంగా ఉరుములతో స్వాగతం...




రాష్ట్రానికి బిజెపి ద్రోహం



బి.వి.రాఘవులు



ఎం.ఎ.బేబి



ఎం.ఎ.గఫూర్



వి.రాంభూపాల్

- అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం ఆ పార్టీలకు లేదు
- విభజన హామీల అమలు ఒక్కటీ జరగలేదు
- బిజెపిని గద్దె దింపితేనే ప్రజలకు మేలు
- 'అనంత' బహిరంగ సభలో సిపిఎం నేతలు ఎం.ఎ.బేబి, బివి.రాఘవులు, గఫూర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకుండా రాష్ట్రానికి బిజెపి తీరని ద్రోహం చేసిందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు విమర్శించారు. కేంద్రంలో అధికారంలోనున్న బిజెపిని ప్రశ్నించే ధైర్యం వైసిపి, టిడిపి, జనసేనలకు లేదని ఎద్దేవా చేశారు. అనంతపురం నగరంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బహిరంగ సభ జరిగింది. గత రెండు రోజులుగా అనంతపురంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం ఆ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించారు. ముందుగా టవర్‌క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా నగర పాలక సంస్థ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన జరిగింది. వందలాది మంది ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, బివి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్‌లు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. బహిరంగ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధి, విశాఖ రైల్వే జోన్, పోలవరం నిర్మాణం ఇలా అనేక హామీలను కేంద్రం అటకెక్కించిందని విమర్శించారు. వీటిని అమలు చేయమని ప్రశ్నించలేని పరిస్థితిల్లో రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేనలు ఉన్నాయని చెప్పారు. పైగా కేంద్రం ప్రజలపై భారాలు మోపే చర్యలన్నింటినీ వేగవంతంగా అమలు చేసేందుకు వైసిపి ప్రభుత్వం ఉత్సహం చూపుతోందన్నారు. విద్యుత్ ఛార్జీల భారాన్ని కేంద్రం సూచనలకు అనుగుణంగా పెంచిందన్నారు. స్మార్టుమీటర్లు ఏర్పాటు చేస్తోందన్నారు. ఆస్తి, చెత్తపన్నుల భారాన్ని ప్రజలపై మోపుతోందన్నారు. కేంద్రంలోని బిజెపి ఓటమే లక్ష్యంగా వామపక్షాలు పనిచేస్తాయని స్పష్టం చేశారు. ఆ పార్టీతో కలిసి పనిచేసే ఇతర రాజకీయ పక్షాల ఓటమికీ కూడా పనిచేస్తామని తెలిపారు. ఎం.ఎ.బేబి మాట్లాడుతూ కేంద్రంలోనున్న బిజెపి మతతత్వ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. ప్రజల మధ్య వైషమ్యాలు పెంచి ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. బిజెపి వ్యతిరేకత దేశవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఆ పార్టీకి వ్యతిరేకంగా విపక్షాలు కలిసొస్తున్నాయని పేర్కొన్నారు. కలిసొచ్చే పార్టీలతో రాబోయే ఎన్నికల్లో పనిచేయడం జరుగుతుందని చెప్పారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ ప్రజల మధ్య వైషమ్యాలు పెంచే బిజెపిని ఇంటికి పంపాల్సిందేనని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదని వైసిపి ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆయన విమర్శించారు. ఎన్నికలకు ముందు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని తెలిపారు. అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా వేతనమిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. అయితే అక్కడ రూ.13500 అవుతే ఇక్కడ ఇస్తున్నది రూ.10 వేల లోపేనని చెప్పారు. దీన్ని పెంచాలని కోరితే పట్టించుకోవడం లేదని విమర్శించారు. అసంఘటిత రంగంలో కార్మికులకు వేతనాలు సవరించాలని అధికారంలోకి వచ్చిన కొత్తలో వినతిపత్రం ఇచ్చామని గుర్తు చేశారు. 40 రోజుల్లోపు కమిటీ వేసి వేతనాలు సవరిస్తామని ముఖ్యమంత్రి వైఎస. జగన్మోహనరెడ్డి హామీనిచ్చారని గుర్తు చేశారు. కాని నాలుగున్నరేళ్ల అయినా ఇప్పటికీ పరిష్కారం చేయలేదని పేర్కొన్నారు. మాట తప్పను మడమ తిప్పనంటే ఇదేనా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శిరవర్గ సభ్యులు ఒ.నల్లప్ప, సావిత్రి, బాలరంగయ్య, సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభకు హాజరైన సిపిఎం శ్రేణులు, అభిమానులు, ప్రజలు



స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

గ్రూప్-2 స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో నగరంలోని తేజ కోచింగ్ సెంటర్‌లో గ్రూప్-2కు సంబంధించిన మెటీరియల్‌ను గురువారం నాడు విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకష్ణ, నరసింహా మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఏ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలైనా లక్షల సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు పోటీపడుతున్నారని చెప్పారు. ఈ పోటీకి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ నిరుద్యోగ సమస్యలపై నిరంతరం పోరాటంతో పాటు ఇతర సామాజిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగానే నిరుద్యోగుల సౌకర్యార్థం గ్రూప్-2 స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులతో పాటు నిరుద్యోగ యువతీ,యువకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా రీ -సర్వే పనులు

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు- భూరక్ష పథకం ద్వారా చేపట్టిన రీ సర్వే పనులను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌తో కలిసి తహశీల్దార్లు, మండల సర్వేయర్‌లు విఆర్‌ఒలతో రీసర్వే పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు భూ సర్వే గురించి అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు. రీ- సర్వే మొదటి విడతలో జిల్లా వ్యాప్తంగా 61 గ్రామాలు పూర్తి చేయగలిగామని చెప్పారు. ప్రస్తుతం రెండో విడత జరుగుతున్న రీ- సర్వేకు చెందిన 39 గ్రామాల్లో వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ దశలో పూర్తయిన గ్రామాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టడానికి అవగాహన కల్పించాలన్నారు. మిగిలినవి కూడా నిర్దేశించిన సమయానికి రానున్న ఆగస్టు మాసం ఆఖరికి పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా డేటా ఎంట్రీలో ఫొటోలు మిస్ మ్యాపు కాకుండా ఖచ్చితమైన ఎంట్రీ ఉండాలన్నారు. రీ సర్వే పూర్తయిన, పూర్తి కావస్తున్న భూముల్లో హద్దు రాళ్లను నాటడంపై దృష్టి పెట్టాలన్నారు. రీ సర్వే పూర్తి కావస్తున్న వాటిలో ఏవైనా పొరపాట్లు ఉంటే కరెక్షన్ మ్యాడ్యుల్ వచ్చిందని, తప్పనిసరిగా పూర్తి వివరాలు సరి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ గాయత్రిదేవి, జిల్లా భూ రికార్డులు సర్వే శాఖ ఎడి రూప్లా నాయక్, ఆర్‌డిఒ మధుసూదన్, నిశాంత్ రెడ్డి, రవీంద్ర, ఐఒఎస్ రాంప్రసాద్, డిఐఒఎస్ మాస్టర్ ట్రైనర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.





సమీక్షా సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు
(ఇన్‌సెట్‌లో రీసర్వే పనులపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎమ్.గౌతమి)

వికలాంగుల కేంద్రం ఏర్పాటుకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వికలాంగుల పునరావస కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడుతామని జిల్లా కలెక్టర్ ఎమ్.గౌతమి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా వికలాంగుల పునరావస కేంద్రం ఏర్పాటుపై డిడిఆర్‌సి మేనేజ్‌మెంట్ బృందంతో కలెక్టర్ సమీక్షించారు. ప్రత్యేక వికలాంగులకు సరైన పునరావాసం కేంద్రం ఏర్పాటు, ఇతర సహాయం కోసం వారి అవసరాలపై కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి ఇవ్వాలని జిల్లా వికలాంగుల శాఖ అధికారి అబ్దుల్ రసూల్‌ను ఆదేశించారు. వికలాంగుల పునరావాసం కేంద్రంలో ఉన్న వారి ప్రయోజనాలు, ఆకాంక్షలు నెరవేర్చే విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా పునరావాస కేంద్రం ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. దీని కోసం రెడ్‌క్రాస్ సొసైటీకి అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన నివేదికను సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయడం, వినికిడి పరికరాలు అమర్చడం వంటివి చేపట్టేందుకు రెఫెరల్ ఆసుపత్రులకు సిఫార్సు, వికలాంగులకు ఉపకరణాల అందజేతకు చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. సిబ్బంది నియామకం, డిడిఆర్‌సిలో మౌలిక సదుపాయాలు, వాటికి సంబంధించిన తాత్కాలిక ఏర్పాట్లపై చర్చించారు. ఉపాధి కల్పన అధికారి శాఖ ద్వారా కూడా వికలాంగుల పునరావస కేంద్రంలోని దివ్యాంగులకు వివిధ శిక్షణ, అవగాహన కార్యక్రమాల సేవలు అందించాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం వికలాంగుల పునరావాస కేంద్రం ఏర్పాటుకు భవనాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ యుగంధర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీదేవి, రెడ్ సొసైటీ జిల్లా కార్యదర్శి హరిణి, జిల్లా కోఆర్డినేటర్ మోహన కృష్ణ వికలాంగుల సంక్షేమ శాఖ సూపరిటెండెంట్ రమణప్ప, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జగనన్న సురక్షతో మరిన్ని సేవలు



ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ప్రజాశక్తి పెద్దవడుగూరు

జగన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మరిన్న సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని లక్షుంపల్లి సచివాలయ వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు, వివిధ ప్రభుత్వ పథకాలతో పాటు ప్రభుత్వ సేవలకు సంబంధించి ఏవైనా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి ప్రజలకు రక్షగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చిందని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగభూషణ ఎంపీడీవో కుల్లాయి స్వామి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ నిర్మాణానికి భూమిపూజ

యాడికి : మండల కేంద్రంలోని పిన్నేపల్లి రోడ్డులో జగనన్న కాలనీ నిర్మాణానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గురువారం నాడు భూమిపూజా చేశారు. అనంతరం తాగునీటి బోరుబావిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలందరికీ సొంతింటిని కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అందులో భాగంగానే జగన్న కాలనీలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసి మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, మాజీ జెడ్పీటీసీ వెన్నపూస వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ కమలపాడు చిన్నప్ప, సర్పంచి పండు అనురాధ, ఉప సర్పంచి కాసా చంద్ర మోహన్, ఎంపిడిఒ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.



బిఎస్.రావుకు నివాళులు అర్పిస్తున్న అనంతపురం శ్రీ చైతన్య విద్యాసంస్థ సిబ్బంది

శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత బిఎస్ రావుకి అశ్రునివాళి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని శ్రీచైతన్య స్కూల్‌లో గురువారం ఆ విద్యాసంస్థల అధినేత మృతికి అనంతపురం జోన్ ఎజిఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది అశ్రునయనాలతో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డా. బిఎస్ వారు ఆకస్మిక మరణం దేశ వ్యాప్తంగా కలచివేసింద న్నారు. 35వేల పై చిలుకు ఉద్యోగుల కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయన్నారు. రావు ప్రస్థానం ఆదర్శప్రాయం అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, డీన్లు, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేత

ప్రజాశక్తి-శెట్టూరు

మండల పరిధిలోని చింతర్లపల్లి పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాల గురించి తెలియజేశారు. అనంతరం పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మైథిలి, లక్ష్మీదేవి, డిప్యూటీ తహశీల్దార్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన గృహ నిర్మాణ పనుల పురోగతి, కురుగుంట లేఔట్‌లో కేటాయించిన లబ్ధిదారుల ఈకెవైసి, ఆలమూరు లేఔట్‌లో ఇళ్ల నిర్మాణం పూర్తయిన వారి నుంచి కట్టించాల్సిన రూ. 35వేలు వంటి అంశాలపై గురువారం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని సచివాలయాలు, ఆమెనిటీస్ కార్యదర్శులు, మెప్మా విభాగం సిబ్బందితో కమిషనర్ భాగ్యలక్ష్మ, హౌసింగ్ పిడి కేశవ నాయడు సమీక్షించారు. సమావేశంలో హౌసింగ్ డిఇ కృష్ణారావు, నగరపాలక డిప్యూటీ కమిషనర్ సావిత్రి, టిపిఆర్‌ఓ విశ్వజ్యోతి, అన్ని సచివాలయాలు, ఆమెనిటీస్ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న రామ్మోహన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామంలో సర్వే నెంబర్ 61-1లో 4.03 ఎకరాలను 18-01-2022న భోగతి చంద్రమ్మ నుంచి అదే గ్రామానికి చెందిన తలారి అంజినేయులు కొనుగోలు చేశాడు. తరువాత ఆభూమి రిజిస్ట్రేషన్‌ను సబ్ రిజిస్ట్రార్ రద్దు చేశారు. రెండువర్గాల వారు లేకుండానే డాక్యుమెంట్‌ను రద్దుచేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై జిల్లా సబ్‌రిజిస్ట్రార్ నాగభూషణం డిఐజి మాధవికి నివేదిక అందజేశారు. ఈ నివేదికల ఆధారంగా ఉన్నతాధికారులు రామ్మోహన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అక్రమ బదిలీలను రద్దు చేయాల్సిందే

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అక్రమ బదిలీలను వెంటనే ఆపి, 2023 జూన్ నెలలో బదిలీ పొందిన ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ కొత్త పాఠశాలలో చేరిన ఉపాధ్యాయులకు నెల రోజులు గడిచినా చాలా మందికి ఇంత వరకు జీతాలు అందక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బ్యాంకు లోన్‌లు తీసుకున్నవారికి బ్యాంకు వారు ఫైన్‌లు వేస్తున్నారని తెలిపారు. ఆరోగ్య సమస్యలు, కుటుంబ ఖర్చులకు కూడా ఇబ్బందికరంగా మారిందన్నారు. వెంటనే వీరందరికీ జీతాలు అందించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో జీతాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించి జీతాలు ఇవ్వకపోతే డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.గోవిందరాజులు మాట్లాడుతూ బదిలీలకు ముందు బదిలీల తర్వాత కూడా దాదాపు ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపుగా 45 మంది వరకు అక్రమ బదిలీల ద్వారా వారికి అనుకూలమైన పాఠశాలలో చేరారని తెలిపారు. వెంటనే ఈ బదిలీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ శ్రీసత్య సాయి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం బదిలీల్లో బ్లాక్ చేసిన పోస్టుల్లో అక్రమ బదిలీల ద్వారా వస్తున్న వారికి పోస్టింగ్ ఇవ్వడం ప్రభుత్వం యొక్క ద్వంద్వ నీతి అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వివి.రమణయ్య, ఉపాధ్యక్షులు ఆర్.రామప్ప చౌదరి, సరళ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, ఆడిట్ కమిటీ మెంబర్ సుబ్బరాయుడు వివిధ మండలాల నుంచి హాజరైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సభ్యులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు ఈఈఈ విభాగాధిపతిగా డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా డాక్టర్ యం.రామశేఖర రెడ్డి గురువారం భాధ్యతలు స్వీకరించారు.ఉపకులపతి జి.రంగ జనార్ధన, రెక్టార్ యం.విజయ కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్‌ల నేతత్వంలో ఎలక్ట్రకల్ ఇంజినీరింగ్ విభాగం అభివద్ధికి తన వంతు కృషి చేస్తానని రామశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ సి.శశిధర్, యూనివర్సిటీ డైరెక్టర్లు, వర్సిటీ పరీక్షలు విభాగం అడిషనల్ కంట్రోలర్స్ తదితరులు రామశేఖర్ రెడ్డికిపుష్ప గుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.



రామశేఖర్‌రెడ్డిని అభినందిస్తున్న రిజిస్ట్రార్ సి.శశిధర్

ప్రజాశక్తి
www.prajasakti.com

వాలంటీర్లను కించపరచడం పవన్‌కు తగదు

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

సేవాభావంతో పని చేస్తున్న వాలంటీర్లను జనసేన అధినేత పవన్ కల్యాణ్ కించపరిచేలా మాట్లాడడం తగదని, వాలంటీర్, సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. నగరంలోని రాణినగర్, అశోక్‌నగర్, రాజీవ్ కాలనీల్లో నిర్వహించిన 'జగనన్న సురక్ష' క్యాంపుల్లో గురువారం ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ మీద అవగాహన లేని పవన్ కళ్యాణ్ వాలంటీర్ల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడడం శోచనీయమన్నారు. పవన్ కళ్యాణ చంద్రబాబు ఆదేశాలమేరకు పనిచేస్తున్నారని విమర్శించారు. వాలంటీర్లు ప్రభుత్వంలో భాగస్వాములని, తప్పు చేస్తే ప్రభుత్వం ఉపేక్షించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గౌస్‌బేగ్, జెసిఎస్ కన్వీనర్లు లక్ష్మన్న, చింతకుంట మధు, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, కార్పొరేటర్లు సుమతి, నాగమణి, ఎం.దేవి, వై.లక్ష్మిదేవి, లీలావతి, నరసింహులు, వెంకటరమణ, సైఫుల్లాబేగ్, సర్పంచి ఆశాబీ, ఎంపిటిసి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని 74-ఉడేగోళంలో సచివాలయం వద్ద గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అలాగే వడ్రవన్నూరులో ఎంపిడిఒ కొండయ్య ఆధ్వర్యంలో 164 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి, డిప్యూటీ తహశీల్దార్ సురేష్, పంచాయతీ కార్యదర్శి వేణు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ప్రజలకు మెరుగైన సేవలందించడమే 'జగనన్న సురక్ష' ధ్యేయమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని సచివాలయం-1 పరిధిలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి ఆయనతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కుష్బూకొఠారి, ఎంపిడిఒ చంద్రమౌళి, పంచాయతీ ఈఓ గౌస్, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, సర్పంచి లలిత, ఉపసర్పంచి వన్నప్ప, కురుబ, ఎంబిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేసులు, వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ మీరంబాషా, వార్డు సభ్యులు, ఎంపిటిసిలు, కో ఆప్షన్ సభ్యుడు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

బొమ్మనహాల్ : మండల పరిధిలోని ఉద్దేహాల్ గ్రామంలో గురువారం పంచాయతీ కార్యదర్శి బాషా ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిడిఒ షకీలా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఈఒపిఆర్‌డి, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీర్ బాషా, నర్సు జైనబ్బి, కోటేశ్వర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రమేష్, వన్నూరుస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

పుట్లూరు : 'జగనన్న సురక్ష' బృహత్తరమైన కార్యక్రమమని తహశీల్దార్ మోహన్‌కుమార్, ఎంపిడిఒ యోగానందరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సి.వెంకన్నపల్లి సచివాలయం పరిధిలో 167మందికి, కోమటికుంట్ల సచివాలయం పరిధిలో 184 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు ఉచితంగా జారీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డి ఆనంద ప్రసాద్, హౌసింగ్ ఏఈ లోకేష్ కుమార్, మండల అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల పరిధిలోని ఎర్రగుంట్ల, సిరివరం గ్రామాల్లో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ తేజోష్ణ లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సిరివరం సర్పంచి జగన్నాథరెడ్డి, ఈఒఆర్‌డి వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

గృహ హింస కేసు నమోదు

ప్రజాశక్తి- పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామానికి చెందిన నాగసులోచన(28) ఫిర్యాదు మేరకు గురువారం ఆమె అత్తారింటి వారు గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. పెద్దపప్పూరు మండల పరిధిలోని నరసాపురం గ్రామానికి చెందిన పెద్దకొల్లిగారి నరేష్, అతడి తల్లిదండ్రులపై గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరులు అరెస్టు

మండల పరిధిలోని నారాయణపల్లి గ్రామంలో గురువారం పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేసి జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 5,300 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే చిన్నపరెడ్డికి నివాళి

ప్రజాశక్తి -కణేకల్లు

మాజీ ఎమ్మెల్యే లక్కు చిన్నపరెడ్డి మండల రైతుల గుండెల్లో చిరస్థాయిగా ఉండే వ్యక్తి అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. చిన్నపరెడ్డి జయంతి సందర్భంగా గురువారం కాపు ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాపు మాట్లాడుతూ కణేకల్లులోని చిక్కణ్ణేశ్వర చెరువుకు హెచ్‌ఎల్‌సి కాలువ ద్వారా తుంగభద్ర నీటిని తెప్పించి కొన్ని వేల ఎకరాలకు సాగునీటితో పాటు వందల గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించిన అపర భగీరథుడు చిన్నపరెడ్డి అన్నారు. ఆయన రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి పద్మావతి, రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్ప, టౌన్ కన్వీనర్ కేశవరెడ్డి, డాక్టర్ సోమన్న, ఉషారాణి, మారెన్న, బద్రి, హనుమంత రాయుడు, భాస్కర్, లోకేష్, టైలర్ చిక్క, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



చిన్నపరెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న కాపు

పాడిరైతులకు అండగా అమ్మ డెయిరీ

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

పాడి రైతులకు అమ్మ డెయిరీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. అమ్మ డెయిరీలో రెండు రోజుల్లో పాలు సేకరిస్తామని, ఇతర డెయిరీల కంటే లీటర్‌పై అదనంగా రూ. 1 ఇస్తామన్నారు. నెలాఖరులోగా 50 వేల లీటర్ల దాకా సేకరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 15 రోజులకోసారి డబ్బులు చెల్లిస్తూ 90 రోజుల తర్వాత వచ్చిన లాభాలన్నింటినీ వాటాలు చేసి రైతులకు పంచుతామన్నారు. అంతకుముందు మండల పరిధిలోని ఎం.బండమీదపల్లిలో గురువారం ఆయన జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి సచివాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. అలాగే ఆత్మకూరు సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలమూరు వద్ద 6 వేల ఇళ్లు కడుతున్నామన్నారు. పరిటాల సునీత ఉన్నప్పుడు అమ్మఒడి వచ్చిందా, ఇళ్లు వచ్చాయా అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపిపిలు, జడ్పిటిసిలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, వార్డు మెంబర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని పాడి రైతులు, ఇతర ప్రజలకు రుణాలిప్పించేందుకు ఎడిసిసి, ఎస్‌బిఐ, కెనరా, ఎపిజిబిల సహకారంతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రుణమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గేదెలు, ఆవుల కొనుగోలుకు బ్యాంకులు రుణాలివ్వడానికి ముందుకొచ్చాయన్నారు. ఇటుక పెల్లల ఫ్యాక్టరీల కోసం దరఖాస్తు చేసుకున్న వారికీ రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, పామిడి వీరాంజనేయులు, డిఆర్డిఎ పిడి నరసింహారెడ్డి, ఆయా బ్యాంకుల ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, గిరిజమ్మ

వైస్ ఎంపిపి ఉపఎన్నికలో అదే తంతు..!

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం మండల ఉపాధ్యక్షుల ఎన్నిక విషయంలో మళ్లీ అదే తంతు కొనసాగింది. వివరాలు.. వైస్ ఎంపిపి ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా ఉన్నతాధికారుల సూచన మేరకు మండల పరిషత్ అధికారులు ఉపఎన్నిక నిర్వహణకు గురువారం ఏర్పాట్లు చేసి వేచి చూసినప్పటికీ సభ్యులు రాకపోవడంతో మళ్లీ అదే తంతు పునరావృతమైంది. జూన్ 8, 9 తేదీల్లో ఉపఎన్నిక నిర్వహించేం దుకు మండల పరిషత్ అధికారులు ఏర్పాటు చేసినప్పటికీ సభ్యులు ఎవరు రాలేదు. ఇదే విషయాన్ని ప్రొసీడింగ్ ఆఫీసర్ రవిశంకర్‌రెడ్డి జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం పంపారు. తాజాగా గురువారం వైస్ ఎంపిపి ఉప ఎన్నిక ప్రక్రియ జరగకపోవడంతో ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ప్రొసీడింగ్ ఆఫీసర్ రవిశంకర్‌రెడ్డి, ఎంపిడిఒ కొండయ్య తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కావలి సత్యనారాయణ స్థానంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరిని వైస్ ఎంపిపిగా చేయాలని అధికార పార్టీ నాయకులు అభిప్రాయానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.


సభ్యుల కోసం వేచి ఉన్న అధికారులు

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : పీడీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

జగనన్న కాలనీల్లో ప్రతి ఇల్లు నిర్మించాలని గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేశవ నాయడు అధికారుల ను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఆయన గృహ నిర్మాణాల పురోగతిపై సచివాల యాల అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్, లేఅవుట్ స్పెషల్ ఆఫీసర్లు, హౌసింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణం ప్రారంభం చేయని లబ్ధిదారులతో వారి ఇల్లు దగ్గరికి వెళ్లి అవగాహన కల్పించి గృహ నిర్మాణాలు వేగవంతం చేసి, వారంలో పురోగతి చూపాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపిపి దాసరి సునీత, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ విజయభాస్కర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీమన్నారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేశవ నాయడు

గూగూడులో అధికారుల పర్యటన

నార్పల : కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గురువారం మండల పరి ధిలోని గూగూడులో మండల అధికారులు పర్యటించారు. వీలైనంత తొందరగా ఏర్పాట్లను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ పాలక వర్గం, అధికారులతో కూడా మాట్లాడి ఉమ్మడిగా చేపట్టాల్సిన పనులు, తాగునీరు, విద్యుత్, తదితర ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్‌బాబు, ఎంపిడిఒ పి.దివాకర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఈఓఆర్‌డి జి.లక్ష్మీనరసింహా, ఎఈ ఆర్‌డబ్ల్యూఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఈవో శోభారాణి, పంచాయతీ కార్యదర్శులు సర్పంచి రమణకుమారి శివయ్య, ఎంపిటిసి రాజారెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి, రాజశేఖర్, సభ్యులు గోపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం విద్యార్థినికి గోల్డ్ మెడల్

రాయదుర్గం : పట్టణానికి చెందిన పూజారి శ్రీనివాసులు కుమార్తె పి.హరిత బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. హరిత బళ్లారిలోని బళ్లారి బిజినెస్ కాలేజీలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీ పూర్తి చేసింది. బళ్లారిలో గురువారం జరిగిన విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 11వ కాన్వొకేషన్ సభలో కర్నాటక గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ నుంచి హరిత గోల్డ్ మెడల్ అందుకుంది. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిగ్రీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు ఆమెకు గోల్డ్ మెడల్ లభించింది. హరిత గోల్డ్ మెడల్ సాధించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

సిఎం జగన్ అములు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ దక్కాలన్నదే ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సంకల్పమని యువ నేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం మండల పరిధిలోని గన్నెవారిపల్లి సచివాలయం-2 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలకు ఎంపిక కాకుంటే సచివాలయ అధికారులను కలవాలని, వారి నుంచి సరైన సమాధానం రానప్పుడు, నేరుగా ఎమ్మెల్యే దృష్టికి మీ సమస్యను తీసుకురావచ్చన్నారు. ప్రభుత్వం ప్రజల కోసం ఇంకా మరెన్నో పథకాలను అమలు చేయనుందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక సుస్థిరత దిశగా పయనించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రంగారావు, ఈఓఆర్‌డి జిలాన్‌బాషా, జడ్పిటిసి రమణమ్మ, ఎంపిటిసి రవికుమార్, పలు గ్రామాల సర్పంచులు, వైసిపి మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, రామ్‌శేఖర్, ప్రభాకర్, గురుప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఉరవకొండ : ప్రతి రైతు చిరు ధాన్యాలు సాగు చేసి ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి కృషి చేయాలని జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు సూచించారు. విడపనకల్లు మండల పరిధిలోని ఉండబండ గ్రామంలో గురువారం జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిరి ధాన్యాల పంటల సాగు, 'ఆత్మహత్యలు వద్దు- ఆనందక రమైన జీవితమే ముద్దు' అనే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిరి ధాన్యాల ప్రాముఖ్యత, ప్రయోజనాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం 80 ఏళ్లు పైబడిన విశ్రాంత రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచి శంకరగౌడ్, హెడ్ కానిస్టేబుల్ దేవరాజు, సురేష్, జై కిసాన్ ఫౌండేషన్ ప్రతినిధులు రమేష్, వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

'బెస్త'ల సంక్షేమం, అభివృద్ధికి కృషి : విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

బెస్త కులస్తుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హామీ ఇచ్చారు. పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో గురువారం నియోజకవర్గ బెస్త కుల సేవా సంఘం(గంగ పుత్రులు) ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా విశ్వేశ్వరరెడ్డితో పాటు వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహ య్య, బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ బెస్త కులస్తుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించిన 20 సెంట్ల స్థలం తీర్మాన పత్రాన్ని విశ్వేశ్వరరెడ్డి కులపెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ కల్యాణ మండపం నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, జెడ్పిటిసి బిసి పార్వతమ్మ, ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేశులు, పార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు బసవరాజు, ఎర్రిస్వామి, వార్డు సభ్యులు, వైసిపి నాయకులు, తాలూకా బెస్త సేవ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


విశ్వ, పైలాను సన్మానిస్తున్న బెస్త సంఘం నాయకులు

ఉచిత వివాహాలకు పేర్లు నమోదు చేసుకోండి

పైలా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 19వ తేదీ పెన్నహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో ఉచిత సామూహిక వివాహాలు జరిపిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణంలో కరపత్రాలను ఆవిష్కరించారు. వివరాలకు 75699 81330, 9553871476 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇటుకలపల్లి సిఐగా వై.నరేందర్‌రెడ్డి

ఆత్మకూరు : ఇటుకలపల్లి సిఐగా వై.నరేందర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కడప జిల్లాలోని మైదుకూరు రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ప్రస్తుత సిఐ మోహన్ రిలీవ్ అయ్యారు. నూతన సిఐకి ఎస్ఐతో పాటు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి-గుత్తి

రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుల మందులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ సహాయ సంచాలకులు(ఎడిఎ) ఎం.వెంకటరాముడు సూచించారు. పట్టణంలోని ఎడిఎ కార్యాలయంలో గురువారం డివిజన్ స్థాయి వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాలకు ఇండెంట్ ఇవ్వాలన్నారు. పిఎం కిసాన్ ఈకెవైసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పొలంబడి, వేరుశనగ పంటలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గుత్తి, పామిడి, యాడికి, శింగనమల, పెద్దవడుగూరు మండలాల వ్యవసాయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎడిఎ వెంకటరాముడు

ఉత్తమ విద్యార్థులకు ఆర్థికసాయం

ఉరవకొండ : 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. విడపనకల్లు మండల పరిధిలోని హావలిగి గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సురేష్, కావ్యలకు రూ. 5వేల చొప్పున, జానకి, కరిష్మాలకు రూ. 3వేల చొప్పున, గంగోత్రికి రూ. 2500లను ఫౌండేషన్ ఛైర్మన్ గోపాల్ నాయుడు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కమిటీ సభ్యులు ఆర్కే నాయుడు, శ్రీనివాసులు, హెచ్‌ఎం పి.మధురవాణి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, నాగరాజు, వరప్రసాద్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై దశలవారీ ఆందోళనలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో దశల వారీగా ఆందోళనలు చేపడుతామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు అనుబంధం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహే శ్వర్ స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో గురువారం ఇంజనీరింగ్ పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు, 27న మున్సిపల్ కార్యాలయం ముట్టడి, ఆగస్టు 7న చలో కలెక్టరేట్‌కు పిలుపునాస్తామన్నారు. అప్పటికీ కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 17న చలో విజయవాడకు పిలుపునిస్తామని తెలిపారు. సిఎం జగన్ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను లేని పక్షంలో సమ్మెబాట పడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు నాగరాజు, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారి స్వామి, తిరుమలేష్, ట్రెజరర్ లక్ష్మీనరసమ్మ, లక్ష్మీనారాయణ, ఆది, ఇతర సంఘం నాయకులు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు నల్లప్ప, ఇంజనీరింగ్ సెక్షన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు మురళి, రాయుడు, ఓబుళపతి, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వర్

16న కాశిరెడ్డి నాయన విగ్రహ ప్రతిష్టాపన

పుట్లూరు : మండల పరిధిలోని ఎస్.తిమ్మాపురం గ్రామంలో ఈ నెల 16వ తేదీ కాశిరెడ్డి నాయన విగ్రహాన్ని ప్రతిష్ట చేస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకుడు రామేశ్వర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా రుద్రాభిషేకం, తదితర కార్యక్రమాలతో పాటు భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థుల ఎంపిక

పెద్దవడుగూరు : మండల పరిధిలోని లక్షంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.హరినాథ్, స్కౌట్ మాస్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. పదో తరగతి మార్కులతో పాటు స్కౌట్స్ అండ్ గైడ్‌లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా లక్ష్మీరమణ ఇడుపులపాయ, గణేష్‌దత్త నూజివీడు ట్రిపుల్ ఐటిలో ప్రవేశాలు పొందినట్లు తెలిపారు. వీరి ఎంపిక పట్ల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఆదర్శ ఉద్యోగులకు సన్మానం

కళ్యాణదుర్గం : ఆర్టీసీలో ఉత్తమ సేవలందించిన ఆదర్శ ఉద్యోగులను గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో సన్మానించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శేఖర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే అత్యధిక ఈపికె సాధించిన కండక్టర్లు శ్రీనివాసులు, శంకుంతలమ్మలకు ఆదర్శ ఉద్యోగి ప్రశంసా పత్రాలు అందజేశామన్నారు. డిపోలో పని చేసే ప్రతి ఉద్యోగి ఇలా ప్రశంసా పత్రాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఇ మాధవి, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి మాదన్న, సుబ్బారావు, గ్యారేజీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సిఎం జగన్

ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

సిఎం జగన్ పేద ప్రజల పక్షపాతి అని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, పి.యర్రగుడి గ్రామాల్లో గురువారం ఎంపిపి జి.విశాలాక్షి, సర్పంచులు ఎన్.సుమలత, ఎం.పాపన్న ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి హయాంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సి.సునీలయాదవ్, సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, బేడల వెంకటరాముడు, మల్లయ్య, ప్రవీణ్‌కుమార్, ఎన్.రాజశేఖర్, ఎంపిటిసి చిన్న వీరన్న గౌడ్, సర్పంచి ఎ.వెంకటేష్, ఉప సర్పంచి లాలుస్వామి కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరద, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి


అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి : గుత్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ మల్లేశ్వరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు మండల పరిధిలోని నరసాపురం గ్రామంలో అంగన్వాడీ కార్యకర్త(ఓసి), గుత్తి పట్టణంలోని ఈద్గా వీధి ఆయా(ఓసి), ఆర్ఎస్‌లోని కాలువగడ్డ-2 ఆయా(బిసి.ఈ), స్వీపర్స్ కాలనీ ఆయా(ఓసి), ఎపిఎస్ మిల్లు ఏరియా ఆయా(ఎస్సీ), జక్కలచెరువు ఆర్ఎస్ ఆయా(బిసి.బి)కి కేటాయించినట్లు తెలిపారు.

నార్పల : నార్పల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సిడిపిఒ ఎం.భారతి తెలిపారు. మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లి అంగన్వాదీ హెల్పర్ (ఒహెచ్ డిసేబుల్), పులుసలనూతల హెల్పర్(ఓసి), తిక్కస్వామివీధి-1 హెల్పర్(బిసి-సి), తిక్కస్వామివీధి-2 హెల్పర్(వీహెచ్ డిసేబుల్), నడిమిపల్లి మినీ వర్కర్(ఎస్టీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

ఆత్మకూరు ఉపసర్పంచిగా తైదుల శివారెడ్డి

ఆత్మకూరు : ఆత్మకూరు మేజర్ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని నూతన ఉప సర్పంచిగా ఎన్నికైన తైదుల శివారెడ్డి తెలిపారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఈఓఆర్‌డి, పంచాయతీ కార్యదర్శి శైలజ, వార్డు మెంబర్ల సమక్షంలో ఉప సర్పంచిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు పంచాయతీలోని కుర్లపల్లి, పడమటి కొత్తపల్లి గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, తదితర మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి హేమలత, కురుబ ఫెడరేషన్ డైరెక్టర్ పార్వతమ్మ, దుబ్బ చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపిపిలు విజయ్, నీలిమ, యూత్ మండల కన్వీనర్ జి.కొండారెడ్డి, ఫణిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, బాలపోతన్న, వన్నూరప్ప, వాసుదేవరెడ్డి, పాల్గొన్నారు.


ధ్రువీకరణపత్రం అందుకుంటున్న తైదుల శివారెడ్డి